

ఇసుక డంపులు సీజ్ చేసిన తహసీల్దార్ గంగాధర్(ఫైల్)


నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

5 | నిజామాబాద్, ఆదివారం 16 ఫిబ్రవరి 2025 | KAMAREDDY




మానాలలో నిర్వహించిన భోగ్‌భండార్‌లో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

## సీపీ హెచ్చరికలతోనైనా అక్రమాలు ఆగేనా?

- ఇసుకాసురులను హెచ్చరించిన ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ
- అక్రమ దందాను అరికట్టడంలో లోపించిన కచ్చితత్వం
- ప్రేక్షక పాత్రను పోషిస్తున్న పలువురు పోలీసులు
- బిచ్కుందలో ఇసుకాసురులకు పోలీసుల అండదండలు



బిచ్కుంద మండలకేంద్రంలో అర్ధరాత్రి పోలీసుల వాహనం ముందు నుంచి వెళ్తున్న ఇసుక ట్రాక్టర్(ఫైల్)

**ఉమ్మడి జిల్లాలో** ఇసుక అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నది. అధికారుల అండదండలతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. పట్టించుకునే వారు లేకపోవడంతో తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అధికారుల కండ్లెదుటే అక్రమాలు జరిగినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాలో తప్పు చేశారన్న కారణంతో పలువురు పోలీస్ అధికారులపై డీజీపీ స్వయంగా చర్యలు తీసుకున్నారు. ఆరోపణలు ఉన్న వారందరినీ బదిలీలు చేశారు. ఆ స్థానాల్లో కొత్తగా వచ్చిన వారంతా నిజాయితీగా పని చేయాల్సి ఉండగా.. సగానికి ఎక్కువ ఠాణాల్లో పోలీసుల పాత్ర నివ్వెర పరుస్తున్నది. డీజీపీ ఆదేశాలనే తుంగలో తొక్కి ఇసుకాసురులతో కొమ్ము కాస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో జరుగుతున్నది. కామారెడ్డిలోనూ నేతలు చెప్పినట్లుగా నడుచుకుంటూ రాత్రి వేళలో తమ వాహనాల ముందు నుంచే రయ్‌మంటూ అక్రమంగా ఇసుక తరలి వెళ్తున్నప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదు. పలువురు పోలీసు అధికారుల తీరుతో ఆ శాఖకు చెడ్డ పేరు వస్తున్నది. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ తాజాగా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎవరైనా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు. మరి ఈ నియమం ఖాకీలకు వర్తిస్తుందా? లేదా? అన్నది అనుమానంగా మారింది. పోలీసులు ధైర్యంగా, నిజాయితీగా పనిచేస్తే.. అక్రమార్కుల ఆట కట్టడం సులభమే. కానీ కొంత మంది పోలీసుల సహకారంతోనే ఇసుక అక్రమ రవాణా రాత్రీపగలు తేడా లేకుండా కొనసాగుతున్నది.

–నిజామాబాద్, ఫిబ్రవరి 15
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**కామారెడ్డి ఎస్పీ,** నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ ప్రకటన చర్చనీయాంశంగా మారింది. ఇసుక అక్రమ రవాణాలో పోలీసులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తూ వస్తున్నారనే అపవాదు ఉన్నది. ఈ విషయంలో నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరువు పోయింది. దీంతో డీజీపీ జితేంద్రప్రసాద్‌కు ఆరు నెలల క్రితం 12 మంది పోలీస్ అధికారుల చిట్టా వెళ్లడంతో..ఆయన స్వయంగా చర్యలకు పూనుకున్నారు. పోలీస్ బాస్ ఆదేశాలతో ఇద్దరు సీఐలు, పది మంది ఎస్సైలపై తూతూ మంత్రంగా చర్యలు తీసుకున్నారు. కొంత మందిని బదిలీ చేసి, మరికొంత మందిని కనీసం టచ్ కూడా చేయలేదు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై శాఖాపరమైన విచారణ పూర్తి స్థాయిలో నిర్వహించలేదు. ఇసుకాసురులకు కొమ్ము కాసి జేబులు నింపుకొన్న వారిపై బదిలీ మినహా శాఖాపరమైన చర్యలు లేకపోవడంతో మిగిలిన వారిలో భయం లేకుండా పోయింది. ఏ ఠాణాపై ఇసుక అక్రమ దందా ఆరోపణలు వచ్చాయో ఇప్పుడు అదే ప్రాంతాల్లో తిరిగి అక్రమాలు పురుడు పోసుకుని జడలు విప్పి నాట్యం చేస్తున్నది. ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురవుతామనే జంకు లేకుండా ఖద్దర్ నేతల అండదండలతో ఇసుక అక్రమాలకు పలువురు వత్తాసు పలుకుతూ వివాదాస్పదం అవుతున్నారు. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతామని ఫిబ్రవరి 14న ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ ప్రకటన జారీచేశారు. మరి ఆమె హెచ్చరికలు ఖాకీలకు వర్తిస్తాయా..?లేదా..?అనేది అనుమానమే. అక్రమార్కులపై చర్యలు తీసుకోవడంతోపాటు వారితో చేతులు కలుపుతున్న వారిని కూడా గుర్తించాలని ఇన్‌చార్జి సీపీని ప్రజలు కోరుతున్నారు.

### అన్ని శాఖల సమన్వయంతోనే అక్రమాలకు కళ్లెం..

జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే ఇప్పటి వరకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఇసుక అక్రమ వ్యవహారంలో 31 కేసులు నమోదయ్యాయి. ఇందులో నిజామాబాద్ డివిజన్‌లో 13, ఆర్మూర్ డివిజన్‌లో 13, బోధన్ డివిజన్‌లో ఐదు కేసులు ఉన్నాయి. ఇదంతా అధికారికంగా నమోదైన ఇసుక అక్రమ కేసులు. అనధికారికంగా పట్టుకొని వదిలేసినవి, దొడ్డిదారిలో తిరుగుతున్న వాహనాలు అనేకం ఉన్నాయి. సహజ వనరుల దోపిడీని నివారించి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చేందుకు రెవెన్యూ, మైనింగ్‌తోపాటు పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉన్నది. సర్కారు ఆదాయాన్ని కొల్లగొట్టే అక్రమార్కులను పట్టుకోవాలనే దృఢ సంకల్పం ఉంటేనే ఇది సాధ్యం. లేదంటే ఖద్దరు ఒత్తిళ్లకు మరోసారి ఖాకీలు తలవంచాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.



సుంకెట్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు (ఫైల్)

### బిచ్కుందలో దారుణం..

ప్రభుత్వ అభివృద్ధి పనులకు రెవెన్యూ అధికారులు అనుమతి ఇచ్చినట్లు పత్రాలను చూపిస్తూ దొడ్డిదారిలో ఇసుకను కొల్లగొడుతున్న ఘటనలు ఈ మధ్య మరింత ఎక్కువయ్యాయి. బీర్కూర్, బిచ్కుందలో పలువురు రెవెన్యూ అధికారులైతే ఇష్టారీతిన అనుమతి పత్రాలను జారీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంజీరా పరీవాహక ప్రాంతంలో ఇసుక దోపిడీ దారుణంగా మారింది. రాత్రి వేళలో యథేచ్ఛగా ఇసుక వాహనాల పరేడ్ నడుస్తుందంటే అతిశయోక్తి కాదు. ఫిబ్రవరి 9న నమస్తే తెలంగాణ నిర్వహించిన ఫీల్డ్ విజిట్‌లో విస్తు పోయే వాస్తవాలు వెలుగు చూశాయి. పోలీస్ వాహనం పక్క నుంచే ఇసుకాసురులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నప్పటికీ పోలీసులు కనీసం పట్టించుకోలేదు. ఈ వ్యవహారంలో కొంత మంది పోలీస్ అధికారుల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరి అండదండలతోనే వాహన యజమానులు రెచ్చిపోతున్నట్లు తెలుస్తున్నది. వారంలో ఒక రోజు తూతూ మంత్రంగా దాడులు నిర్వహించి, డంప్‌లను స్వాధీనం చేసుకుంటున్నారు. అనంతరం నాలుగైదు రోజులు అక్రమార్కులను గాలికి వదిలేస్తున్నారు. అక్రమార్కులతో చేతులు కలుపుతున్న వారెవ్వరో గుర్తిస్తే.. దందాను నిలువరించవచ్చనే భావన బిచ్కుంద వాసుల్లో ఏర్పడింది. ఇసుక వాహనాల రాకపోకలతో రాత్రి వేళలో మంజీరా పరీవాహక ప్రాంతాల్లో సామాన్యులు తిరగాలంటే భయపడే పరిస్థితి ఏర్పడింది.

## మానసిక వ్యాధితో బాధపడుతున్న రేవంత్‌రెడ్డి

- తెలంగాణ సాధించిన కేసీఆర్‌పైనే విమర్శలా?
- సొంత పార్టీ నేతలే సీఎం పేరు మర్చిపోతున్నరు
- రాష్ట్ర ప్రజలు రేవంత్‌రెడ్డిని శాశ్వతంగా బహిష్కరిస్తరు
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, ఫిబ్రవరి 15: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మానసిక వ్యాధితో బాధపడుతున్నాడని, రాష్ట్రం సాధించిన కేసీఆర్‌ను తెలంగాణ నుంచి బహిష్కరించాలని మాట్లాడడం ఏమిటని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. వేల్పూర్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సి ఉండగా.. ప్రతిపక్ష నాయకులను విమర్శిస్తూ కాలం వెల్లదీస్తున్నారని మండిపడ్డారు. సొంత పార్టీ నాయకులే సీఎం పేరు మర్చిపోతున్నారని, ఫ్రస్టేషన్‌లో ఉన్న రేవంత్.. మతిభ్రమించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని ఆరోపించారు. ఎన్నో పదవులను గడ్డిపోచలా వదిలేసి, చావునోట్లో తలపెట్టి కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించారని, ఈ విషయం ఎవరిని అడిగినా చెబుతారన్నారు. కేసీఆర్ రాష్ట్రం సాధించకుంటే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యే వాడా అని ప్రశ్నించారు. ఓటుకు నోటు కేసులో దొరికిన రేవంత్‌రెడ్డి.. సీఎం అయినా ఇంకా తీరు మారలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 14నెలలు గడుస్తున్నా.. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తి గా నెరవేర్చలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు రేవంత్‌రెడ్డిని శాశ్వతంగా బహిష్కరించే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ప్రచారం చేసినా.. కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోయిందని గుర్తుచేశారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సూచించారు.

### కులగణన రీ సర్వే చేపట్టాలి..

కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సర్వే అంతా బోగస్ అని, రాష్ట్రంలో రీ సర్వే చేపట్టాలని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై నమ్మకం లేక చాలా మంది సర్వేలో పాల్గొనలేదని, పాల్గొన్న వారు కూడా సరైన వివరాలు వెల్లడించలేదన్నారు. గతంలో కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వే చేయించినప్పుడు.. వ్యక్తిగత వివరాలు అడుగుతారా..? అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారని, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని వ్యక్తిగత వివరాలు సేకరిస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం చేపట్టింది తప్పుడు సర్వే అని అన్ని బీసీ సంఘాలు విమర్శిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బీసీల జనాభా ఎందుకు తగ్గిందని ప్రశ్నిస్తున్నా.. సమాధానం చెప్పే వారే లేరన్నారు. ఇకపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌పై పిచ్చికూతలు కూయడం ఆపేయాలని హెచ్చరించారు. సమావేశంలో పచ్చలనడ్కుడ సొసైటీ చైర్మన్ లింబారెడ్డి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ నాగధర్, మాజీ సర్పంచ్ రమేశ్, నాయకులు గంగారెడ్డి, సంతోష్, డొల్ల రాజేశ్వర్ పాల్గొన్నారు.

### సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

మోర్తాడ్, ఫిబ్రవరి 15: సంత్ సేవాలాల్ మహరాజ్‌ను ప్రజలందరూ ఆదర్శంగా తీసుకోవాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని మానాల గ్రామంలో శనివారం నిర్వహించిన సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కమ్మర్‌పల్లి మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, నాయకులు రాధాకిషన్, బోగ ఆనంద్, ఏనుగు రాజేశ్వర్, సంతోష్, సందీప్, తుక్కాజీ పాల్గొన్నారు.



వేల్పూర్, ఫిబ్రవరి 15: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఈనెల 17వ తేదీన నిర్వహించనున్న వృక్షార్చనకు సంబంధించి పోస్టర్లను వేల్పూర్‌లో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. వృక్షార్చనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



నిజామాబాద్ మార్కెట్ యార్డులో ధర్నా చేస్తున్న హమాలీలు

## రోడ్డెక్కిన హమాలీలు

- కార్మికులపై దొంగతనం మోపడంపై నిరసన
- నిజామాబాద్ మార్కెట్‌లో స్తంభించిన పసుపు విక్రయాలు
- మార్కెట్ కమిటీ చైర్మన్, కార్మికుల మధ్య విభేదాలు
- సెక్యూరిటీ ఇన్‌చార్జిపై దాడి.. మార్కెట్‌లో ఉద్రిక్తత

కంఠేశ్వర్, ఫిబ్రవరి 15: తమను దొంగలుగా చిత్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేస్తూ హమాలీలు రోడ్డెక్కారు. రెండు గంటల పాటు ధర్నా చేశారు. దీంతో మార్కెట్ కమిటీలో పసుపు కొనుగోళ్లు నిలిచిపోయాయి. కొన్ని రోజులుగా మార్కెట్ కమిటీ పాలకవర్గానికి, కార్మికులకు మధ్య నెలకొన్న విభేదాలు శనివారం రోడ్డున పడ్డాయి. మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డికి వ్యతిరేకంగా హమాలీలు ఆందోళన చేపట్టడం తీవ్ర దుమారం రేపింది. తమపై దొంగతనం ఆరోపణ మోపడం సరికాదని, చైర్మన్ వచ్చి మాట్లాడాలని పట్టుబట్టారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీకి వచ్చిన రైతును పంట తూకం వేసి సంతోషంగా ఇంటికి పంపించే తమపై చోరీ మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మార్కెట్ కమిటీ పాలకవర్గంలోని పలువురు మార్కెట్ యార్డును అభాసుపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమను దొంగలుగా చిత్రీకరించిన వ్యక్తులు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రాత్రి రెండు గంటల సమయంలో మార్కెట్ కమిటీని సందర్శిస్తున్నారని.. ఇప్పటి వరకు ఎంతమంది దొంగలను పట్టుకున్నారో చెప్పాలన్నారు. అనంతరం కార్మికులతో మాట్లాడానికి వచ్చిన మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డిని కార్మికులు ముట్టడించారు. అప్పటికే ఆగ్రహంతో ఉన్న కార్మికులు సెక్యూరిటీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌పై దాడిచేశారు. పోలీసులు అతడిని తమ వాహనంలో అక్కడి నుంచి తరలించారు. మధ్యాహ్నం నుంచి పసుపు విక్రయాలు కొనసాగాయి.

### దొంగలుగా చిత్రీకరించడం బాధాకరం..



ఎండకన, వాననక రైతులకు సేవ చేస్తున్నం. అలాంటి మమ్మల్ని కొందరు ఇలా దొంగలుగా చిత్రీకరించడం చాలా బాధాకరం.

–శ్రీనివాస్, గుమాస్తా

### దొంగతనం మోపడం సరికాదు..



కార్మికులపై దొంగతనం మోపడం సరికాదు. మార్కెట్ యార్డులోని ప్రతి కార్మికుడూ.. రైతులకు సాయం చేయడంలో ముందుంటాడు.

-శ్రీహరి, హమాలీ యూనియన్ కార్యదర్శి

### మార్కెట్ యార్డును బద్నాం చేస్తున్నరు..



పాలకవర్గంలోని పలువురు సభ్యులు.. కార్మికులను, మార్కెట్ యార్డును బద్నాం చేయాలని చూస్తున్నరు. చోరీ జరిగితే బయటపెట్టాలి. ఈ విషయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ స్పందించాలి.

-శ్రీనివాస్‌గౌడ్, దడ్వాయి యూనియన్ అధ్యక్షుడు



హమాలీల ధర్నాతో నిలిచిన పసుపు కొనుగోళ్లు



## ఘనంగా సేవాలాల్ జయంతి

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా** సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని గిరిజనులు శనివారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భోగ్ భండార్ కార్యక్రమాలను నిర్వహించారు. సేవాలాల్ విగ్రహాలు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజనులకు అన్నదానం ఏర్పాటుచేశారు. నిజామాబాద్‌లోని హనుమాన్ జంక్షన్ వద్ద సేవాలాల్ విగ్రహానికి ఆర్టీసీ మాజీ చైర్మన్, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనవెంట ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ తదితరులు ఉన్నారు.

–ఇందల్వాయి, ఫిబ్రవరి 15

## 1.19 ఎకరాలకు.. రూ.862 రైతు భరోసా

నవీపేట, ఫిబ్రవరి 15 : కాంగ్రెస్ సర్కారు అన్నదాతలకు అందజేస్తున్న రైతు భరోసాలోనూ మోసం చేస్తున్నది. ఎకరానికి రూ.ఆరు వేల సాయం అందిస్తామన్న సర్కారు ఆ మేరకు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయడం లేదు. నవీపేట మండలంలోని జన్నేపల్లి గ్రామానికి చెందిన రైతు సురేష్‌కు 1.19ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. అతడికి సర్కారు లెక్క ప్రకారం రూ.8,850 రైతు భరోసా రావాల్సి ఉండగా.. కేవలం రూ.862 అతడి బ్యాంకు ఖాతాలో జమచేసింది. ఈ విషయమై అతడు బ్యాంకుకు వెళ్లి అడుగగా.. వారు తమకేమీ తెలియదని సమాధానం ఇచ్చారు. వ్యవసాయాధికారులను సంప్రదించగా.. ఏదైనా సాంకేతిక సమస్య ఉండవచ్చని తెలిపారని రైతు సురేశ్ అన్నాడు. పంట సాగుచేసిన భూమికి కూడా సాయం అందకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.



రైతు సురేశ్‌కు ఉన్న భూమి, ఫోన్‌లో వచ్చిన మెసేజ్